క్లుప్తంగా

విద్యార్థినులకు రక్షణ కల్పించండి

సంగారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ఉన్న మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్ విద్యార్థినులకు రక్షణ కల్పించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఉన్న మహిళా డిగ్రీ కళాశాలకు సరైన ప్రహరీ లేకపోవడంతో రాత్రి సమయాల్లో కళాశాల ఆవరణలోకి ప్రవేశిస్తుండటంతో విద్యార్థినులు భయాందోళనలకు గురవుతున్నారని, అంతేకాకుండా కళాశాలలోని బాత్రూమ్స్ డోర్స్ ధ్వంసం చేశారన్నారు. బోరుమోటారు కూడా ఎత్తుకెళ్లారని తెలిపారు. గతంలో కాపలాదారుడు ఉండటంతో విద్యార్థినులకు రక్షణ ఉండేదన్నారు. కానీ.. అతడిపై దాడి చేయడంతో అతను మానేశాడని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూలిపోయిన ప్రహరీ నిర్మించాలన్నారు. హాస్టల్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో వెంటనే స్పందించిన కలెక్టర్ ఏవో పరమేష్ టౌన్ సీఐతో ఫోన్‌లో మాట్లాడగా విద్యార్థినులకు రక్షణగా పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. వినతిపత్రం అందజేసినవారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రవికిరణ్‌గౌడ్, వాణి ఉన్నారు.

మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడం అభినందనీయమని ఎంఈఓ రాథోడ్ అన్నారు. మేడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పటాన్‌చెరు మండల పరిధిలోని రామేశ్వరంబండ వీకర్‌సెక్షన్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో పార్కర్ సహకారంతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరామ్ మేడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, సర్పంచ్ ధరణి అంతిరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

హత్నూర(సంగారెడ్డి): ఆల్ ఇండియా సమత సైనిక్ దల్ రాష్ట్ర కమిటీ 2024 క్యాలెండర్‌ను మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రాజ్ మాట్లాడుతూ 1927లో మార్చి 13న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్వీయహస్తాలతో వ్యవస్థీకరించిన ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ కుల, మతాలకు అతీతంగా పనిచేస్తోందన్నారు. ప్రజల్లో సామాజిక చైతన్యం నింపి వారి సమగ్ర అభివృద్ధికి పాటుపడాలన్న లక్ష్యంతో ఈ సంఘం 97 ఏళ్లుగా అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతోందని వివరించారు. కార్యక్రమంలో సామాజికవాదులు కిషన్‌రావు, రాష్ట్ర నాయకులు కృష్ణ, నాగేష్, వెంకటేష్, ప్రవీణ్, కృష్ణ, వీరేశం, వీరన్నచారి పాల్గొన్నారు.

చెరువులను కాపాడాలి

జిన్నారం(పటాన్‌చెరు): చెరువులు, కుంటలను కాపాడేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ అన్నారు. జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామంలో మత్స్యకారుల సంఘాల అధ్యక్షులను జిల్లా ఫిషరీస్ సొసైటీ అధ్యక్షుడు మహేశ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పిట్టల రవీందర్ మాట్లాడుతూ ప్రధాన జీవనాధారమైన చెరువులు, కుంటలను కాపాడటంతో పాటు మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మత్స్య సహకార సంఘాల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్స్‌లకు సన్మానం

నారాయణఖేడ్: మండల పరిధిలోని తుర్కాపల్లి తండాకు చెందిన 9మంది ఒకేసారి మేయిల్, ఫిమేయిల్ స్టాఫ్ నర్సులుగా ఉద్యోగాలు పొందినవారిని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్ బుధవారం సన్మానించారు. జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు రశీద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాహెర్, ఎస్టీ సెల్ నాయకులు నెహ్రూనాయక్, సుమన్ పాల్గొన్నారు.

పరిశ్రమ సహకారం అభినందనీయం

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల అభివృద్ధిలో పరిశ్రమలు భాగస్వాములు కావటం అభినందనీయమని ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. బొంతపల్లిలోని న్యూలాండ్ ల్యాబోరేటరీస్ పరిశ్రమ యాజమాన్యం జిన్నారంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఫర్నిచర్‌ను అందించింది. పరిశ్రమ ప్రతినిధులు హేమచంద్ర, డీపీ రెడ్డి, రవి, ఎంపీటీసీ లావణ్య, నాయకులు నరేందర్‌గౌడ్, నరేశ్, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కొండాపూర్(సంగారెడ్డి): మండల కేంద్రంలో రూ.25లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను బుధవారం యూబీ పరిశ్రమ సహాయంతో ఏర్పాటు చేసిన రెండు వాటర్ ప్లాంట్‌లతో పాటు గ్రామంలో 50 సీసీ కెమెరాలు, గ్రామ పంచాయతీ కార్యాలయం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం సభ్యులు, నాయకులు పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి

- పటాన్‌చెరు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


బొంతపల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల, జిన్నారం మండలాల పరిధిలోని బొంతపల్లి, వీరన్నగూడెం, గుమ్మడిదల, సోలక్‌పల్లి, ఇమాంనగర్ గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశ్రామికవాడల్లోని పరిశ్రమల సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేసేవిధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామాల అభివృద్ధికి మరిన్ని పరిశ్రమలు ముందుకు రావాలని సూచించారు. జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్, హుస్సేన్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలు స్ఫూర్తిదాయకం

పటాన్‌చెరు: మహనీయుల జీవితాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం, స్వామి వివేకానంద, ఛత్రపతి శివాజీ విగ్రహాలను ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ నీతీషా, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ముందుకు రావాలి

పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పరిశ్రమలు ముందుకు రావాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రుద్రారంలో ఎంవైకే లాటిక్రేట్ సంస్థ సౌజన్యంతో రూ.10 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న జెడ్పీ ఉన్నత పాఠశాల భవనం, ప్రాథమిక పాఠశాల భవనం, అంగన్వాడీ భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా తోషిబా పరిశ్రమ సహకారంతో రూ.కోటి నిధులతో చేపట్టనున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనం, ఆర్వో ప్లాంట్ల నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ సుప్రజ, సర్పంచ్ సుధీర్‌రెడ్డి, ఎంపీటీసీ రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాండు, సంస్థ ముఖ్య ప్రతినిధులు శ్రీకర్, రోహిత్, సూర్యప్రకాష్, ఉపసర్పంచ్ యాదయ్య, గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ముత్తంగిలో అభివృద్ధి పనులు ప్రారంభం

పటాన్‌చెరు మండల పరిధిలోని ముత్తంగి గ్రామంలో నిర్మించిన పల్లె దవాఖాన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌తో పాటు మహిళా సమైక్య భవనాలను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుప్రజ, సర్పంచ్ ఉపేందర్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

అదనపు బస్సులకు ప్రతిపాదనలు


వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్టీసీ డిపో పరిధిలో వివిధ రూట్లలో బస్సు సౌకర్యం కల్పించేందుకు అదనపు బస్సుల కోసం ఎమ్మెల్యే సంజీవరెడ్డి డీఎం మల్లేశయ్య, మార్కెటింగ్‌సెల్ ఇన్‌చార్జి పాండుకు బుధవారం ప్రతిపాదనలను అందజేశారు. నారాయణఖేడ్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి, సిర్గాపూర్, కల్హేర్, మాసాన్‌పల్లి, నిజాంసాగర్, కంగ్టి, పోట్‌పల్లి, నాగన్‌పల్లికి బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. అదేవిధంగా గాజుల్‌పాడ్‌ల మీదుగా కంగ్టికి మరొక బస్సు, హన్మంత్‌రావుపేట్, మాద్వార్, గునుకులకుంట వరకు బస్సు సౌకర్యం కల్పించేందుకు మొత్తం ఐదు బస్సుల కోసం ప్రదిపాదనలు అందజేశారు. అవసరమైతే మరిన్ని రూట్లలో బస్సులను నడిపేందుకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడుతానని ఎమ్మెల్యే తెలిపారు. పైన పేర్కొన్న ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు అందజేసి నూతన బస్సులు ఏర్పాటు చేసేవిధంగా కృషి చేస్తానని డీఎం మల్లేశయ్య తెలిపారు.

రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

పటాన్‌చెరు టౌన్: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామ సమీపంలోని రవాణాశాఖ కార్యాలయ ఆవరణలో వాహనదారులకు రోడ్డు భద్రతా నియమావళిపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజామోహ్మద్ మాట్లాడుతూ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని తెలిపారు. కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. వాహనదారులు, రవాణాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం


రక్తదానం చేస్తున్న పోలీసు అధికారులు

సంగారెడ్డి టౌన్: రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని సంగారెడ్డి మోటార్ వెహికిల్ అధికారులు కిషోర్, కృష్ణవేణి, శ్రీనివాసులు అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి చందర్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని ఆర్టీఏ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి నరేష్, సిబ్బంది రాజు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కంది మండలంలో...

కంది(సంగారెడ్డి): రక్తదానంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చని ఎంవీఐ కిరణ్ కుమార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసాన్ని పురస్కరించుకొని బుధవారం కందిలోని ఆర్టీఓ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎంవీఐలు శ్రీనివాస్, కృష్ణవేణి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి చందర్, వైద్యాధికారి నరేష్, రాజు పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేయండి


మాట్లాడుతున్న సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద

సదాశివపేట(సంగారెడ్డి): కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద అన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ముఖ్య మహిళా కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికుల పర్మినెంట్ చేస్తామని హామీనిచ్చి పట్టించుకోలేదన్నారు. దీంతో ప్రస్తుత ప్రభుత్వంలోనైనా కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. కార్మికులందరూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, వారి ఆశలు అడియాసలు చేయకుండా కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మహిళా విభాగం నాయకురాలు బుజ్జమ్మ, అసంఘటిత రంగం నాయకురాలు అనసూయ, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి లక్ష్మి, కార్యకర్తలు నరసమ్మ, తస్లీమ్, రహిమాబేగం పాల్గొన్నారు.

కేవీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

సదాశివపేట(సంగారెడ్డి): తహసీల్దార్ కార్యాలయంలో కేవీపీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దార్ సరస్వతి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్, మండల అధ్యక్షుడు మల్లేశం, కార్యదర్శి మహేష్, నాయకులు ప్రభు, సురేష్, నవీన్, సురేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

కంది(కంది): మండల పరిధిలోని చిద్రుప్ప, ఇంద్రకరణ్ గ్రామాల్లో అనుమతి లేకుండా ఫామ్ ప్లాట్లు చేపట్టడంతో ఎంపీఓ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం అక్రమ నిర్మాణాలను కూల్చివేయించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ హెచ్ఎండీఏ అనుమతి లేకుండా ఎవరైన వెంచర్లు, నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల పంచాయతీ అధికారులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వాణి, అశోక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైల క్షేత్రానికి భక్తుల పాదయాత్ర


పాదయాత్రగా తరలివెళ్తున్న భక్తులు

ఝరాసంగం(జహీరాబాద్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీశైలంలోని భ్రమరాంభిక మల్లికార్జున క్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరారు. మండల పరిధిలోని మల్లయ్యగిరి గుట్ట వద్ద పీఠాధిపతి బసవలింగ అవధూతగిరి మహారాజ్‌తో కలిసి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఝరాసంగంలోని కేతకి సంగమేశ్వర ఆలయంలో పార్వతిపరమేశ్వరులకు ధనసిరి పీఠాధిపతి శివాచార్య స్వామితో ప్రత్యేక పూజలు చేసి పాదయాత్రగా తరలివెళ్లారు. 10 రోజుల పాటు పాదయాత్ర సాగించనున్నట్లు నిర్వాహకులు సంజీవ్‌సింగ్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు సన్మానం


సన్మానం పొందిన ఇంద్రేశం గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు


సర్పంచ్ సుగుణమ్మ, వార్డు సభ్యులను సన్మానించిన గ్రామస్తులు

మునిపల్లి(అందోల్): సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో మండల పరిధిలోని బుస్సారెడ్డిపల్లి, తదితర గ్రామాల్లో సర్పంచ్, వార్డుసభ్యులకు సన్మానించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులను ప్రజల సహకారంతో అభివృద్ధి చేసినట్లు బుస్సారెడ్డిపల్లి సర్పంచ్ స్వప్నశశికుమార్ అన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్‌లో...

జహీరాబాద్ టౌన్: మండల పరిధిలోని మొగుడంపల్లి గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని సర్పంచ్ పట్లోళ్ల సుగుణమ్మ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొగుడంపల్లి గ్రామాభివృద్ధికి తన వంతుగా కృషి చేశానని తెలిపారు. అనంతరం సర్పంచ్‌తో పాటు వార్డుసభ్యులను ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు విజయమోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మల్లేష్‌గౌడ్, డిప్యూటీ సర్పంచ్ పసియోద్దిన్, తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్ మండలంలో...

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామ పంచాయతీల పాలకవర్గం పదవీకాలం ఈ నెల 31తో ముగియడంతో మండలంలోని సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు మండల పరిషత్ కార్యాలయంలో ఆత్మీయ అభినందనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మనోజ్‌రెడ్డి ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ మధులత, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

పాలకవర్గం సభ్యులకు సన్మానం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నందికంది సర్పంచ్ కుందెన రాజు, ఉపసర్పంచ్ సునీల్, పంచాయతీ పాలకవర్గం సభ్యులను బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, మండల విద్యాధికారి అంజయ్య, ఎంపీటీసీ సునీతాసుధాకర్, వైద్య సిబ్బంది, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

గ్రామాన్ని అభివృద్ధి చేశాం...

పటాన్‌చెరు టౌన్: ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సహకారంతో ఇంద్రేశం గ్రామాన్ని అభివృద్ధి చేశామని సర్పంచ్ దండు నర్సింహులు అన్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో పాలక మండలి సభ్యులు సర్పంచ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సుభాష్, ఉప సర్పంచ్ శివగౌడ్, వార్డుసభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మనూర్(నారాయణఖేడ్): మండల పరిధిలోని గట్టులింగంపల్లి, దుదగొండకు చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు బుధవారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, నాయకులు ధనరాజ్‌పాటిల్, శ్రీకాంత్‌రెడ్డి, రాజుసేట్, చందు పాల్గొన్నారు.

'పది' పరీక్షల్లో ప్రతిభ చూపాలి

మునిపల్లి(అందోల్): రాబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ చూపాలని తహసీల్దార్ తెన్‌మొళి, ఎంపీడీఓ హరినందన్‌రావు అన్నారు. మండల పరిధిలోని కంకోల్ గ్రామంలోని తెలుగు, ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బోధన తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. శ్రద్ధగా చదువుకొని అధిక మార్కులు సాధించాలని సూచించారు. ఆర్ఐ రవీందర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

జహీరాబాద్ టౌన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని రంజోల్ బాబానగర్ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బాబానగర్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, మౌళిక వసతులు కల్పించాలని కోరినా ఎవరూ పట్టించుకోవడంలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సమస్యల పరిష్కరించాలని నిరసన చేపట్టగా స్పందించిన అధికారులు బాబానగర్‌ను సందర్శించి సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. కానీ నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయడంలేదని వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిలిచిపోయిన రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించి మంచి నీటి సౌకర్యం కల్పించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

◆ సామాజిక సేవకులకు సన్మానం

జహీరాబాద్: వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నారాయణరెడ్డి, విఠల్‌రెడ్డి, పాండయ్య, డాక్టర్ శేషులను బుధవారం ఘనంగా సన్మానించారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, రోటరీ క్లబ్ నాయకులు సంగ్రాం పాటిల్, వెంకటేశం, మహిపాల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, సంగమేశ్వర్, రుద్రప్ప పాటిల్, నోయల్, నాగభూషణం, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, సిద్దన్న, చంద్రశేఖర్, రాజయ్య, లాల్‌రెడ్డి, ఇర్మల్ పాపిరెడ్డి పాల్గొన్నారు.

◆ మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఝరాసంగం(జహీరాబాద్): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ సంజీవరావు అన్నారు. ఝరాసంగంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన భోజనం అందించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ప్రత్యేకాధికారిణి తదితరులు ఉన్నారు.

◆ సమస్యల పరిష్కారంలో కేంద్రం విఫలం

నారాయణఖేడ్: కార్మికులు, రైతుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, మాజీ అధ్యక్షుడు మాణిక్యం అన్నారు. బుధవారం ఖేడ్‌లో కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా సమ్మెను నిర్వహించనున్నట్లు తెలిపారు.

◆ రేపటి సమావేశం వాయిదా

నారాయణఖేడ్: మండల పరిధిలోని జుజాల్‌పూర్‌లోని హెచ్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 2న నిర్వహించతలపెట్టిన నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తదుపరి సమావేశాన్ని ఎప్పుడు నిర్వహించేది తర్వాత తెలియజేస్తామన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు విషయాన్ని గమనించాలని సూచించారు.

◆ లక్డారంలో క్రషర్ల వద్ద సర్వే

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని లక్డారం గ్రామంలో క్రషర్లపై టాస్క్‌ఫోర్స్ బృందం సర్వే రెండో రోజు చేపట్టారు. క్రషర్ నిర్వాహకుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ నేతృత్వంలో ఇటీవల ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కాగా బుధవారం టాస్క్‌ఫోర్స్ బృందం లక్డారంలోని సర్వేనెంబర్ 738లో సర్వే నిర్వహించారు. సర్వేలో పటాన్‌చెరు తహసీల్దార్ భాస్కర్, మైనింగ్ అధికారులు, సర్వేయర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

◆ సెయింట్ ఆన్ స్కూల్ విద్యార్థినికి సన్మానం

సంగారెడ్డి: ప్రధానమంత్రి నరేంద్రమోడీ నిర్వహించిన పరీక్షా పే చర్చలో సెయింట్ ఆన్ స్కూల్, సంగారెడ్డి విద్యార్థిని షాదాన్ సదాఫ్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. 'సంపన్న భారతదేశం కోసం ఐదు ప్రతిజ్ఞలు' అనే కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా నుంచి పాల్గొన్న ఏకైక విద్యార్థిని షాదాన్ సదాఫ్ అని స్కూల్ ఉపాధ్యాయులు తెలిపారు.

◆ చేర్యాలలో చెకుముకి టాలెంట్ టెస్టు

కంది(సంగారెడ్డి): కంది మండల పరిధిలోని చేర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. టెస్టులో కందిలోని కొత్వాల్ హైస్కూల్ విద్యార్థులు సిందూజ, ఆల్ఫియానాజ్, చేర్యాల పాఠశాల విద్యార్థులు పూజిత, అభినయ, ఆల్ఫియా సుల్తానా, సంజనాచంద్రిక, సాయి, చరణ్ మొదటి స్థానం సాధించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.

◆ ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలి

మునిపల్లి(అందోల్): ఉపాధిహామీ కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ హరినందన్‌రావు పంచాయతీ కార్యదర్శులను, టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. బుధవారం ఎంపీపీ సర్వసభ్య సమావేశ మందిరంలో ఉపాధి హామీ పనులపై సమావేశం (రివ్యూ మిటీంగ్) నిర్వహించారు. ఎంపీఓ అంజలిదేవి తదితరులు పాల్గొన్నారు.

◆ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రతాప్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ నాయకత్వం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నిక చేయటం సంతోషంగా ఉందన్నారు.

వృథాగా మిషన్ భగీరథ నీరు


వృథాగా పోతున్న తాగునీరు

ఝరాసంగం(జహీరాబాద్): ఝరాసంగం ప్రధాన రహదారిపై మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. ఎండాకాలం సమీపిస్తున్న తరుణంలో తాగునీరు వృథాగా పోవటంతో అధికారులు పరిశీలనపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.